క్లుప్తంగా

పోషకాలతోనే ఆరోగ్యం

మద్దికెర : పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమే గాకుండా వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కాన్పులు ప్రభుత్వ వైద్యశాలలో చేసుకోవడం సురక్షితే కాకుండా ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి షష్టి పూజలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర : శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టిని పురస్కరించుకొని బుధవారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, మహామంగళహారతి చేపట్టారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులను హోమశాల వద్ద కొలువుంచి హోమములు తదితర కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మద్దికెర : వివిధ రకాల ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఎంఈఓ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరిట విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. కళాశాలు, విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అరుణ్, జస్వంత్, తిప్పన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసానికి యత్నం



డీసీకొండ వద్ద ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ జెండా

తుగ్గలి : మండల పరిధిలోని దిగువచింతల కొండ వద్ద నున్న శిలాఫలాన్ని ధ్వంసం చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు యత్నించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద గత ప్రభుత్వంలో దాదాపు రూ.30లక్షలకు పైగా నిధులతో సీసీరోడ్డు వేశారు. అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సీసీ రోడ్డును ప్రారంభించారు. ప్రారంభోత్సవ సమయంలో శిలాఫలకం ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ జెండా కర్రను పీకేసి, శిలాఫలకాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించారు. ఇది టీడీపీ వర్గీయుల పనే అయి ఉంటుందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఈ విషయంపై జొన్నగిరి పోలీసులకు సమాచారం అందించారు.

ఈసీగా పెంచలయ్య

తుగ్గలి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా పెంచలయ్య నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఈసీగా ప్రదీప్‌కుమార్ పనిచేశారు. రెగ్యులర్ ఈసీగా గూడూరులో పనిచేస్తున్న ఈసీ పెంచలయ్యను జిల్లా పీడీ అమరనాథరెడ్డి నియమించారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

స్టూడెంట్ కిట్లు సిద్ధం



ఎమ్మార్సీలో హెచ్‌ఎంలకు పుస్తకాలను అందిస్తున్న ఎంఈఓ-2 మద్దయ్య

కృష్ణగిరి: పాఠశాల ప్రారంభం రోజుననే విద్యార్థులకు అందించేందుకు స్టూడెంట్ కిట్లను సిద్ధంగా ఉంచామని ఎంఈఓ-2 మద్దయ్య తెలిపారు. బుధవారం ఆయన ఎమ్మార్సీలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. మండల వ్యాప్తంగా 46 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 6,581 మంది విద్యార్థులకు వీటిని అందించనున్నట్లు తెలిపారు. వీటిలో పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు బ్యాగ్, యూనిఫాం, షూలు, సాక్స్‌లు, బెల్ట్, డిక్షనరీ ఉంటాయన్నారు. వీటిని విద్యార్థులకు అందరికీ సకాలంలో అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు వీరనాగప్ప, కృష్ణమూర్తి, శ్యామల, మధు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బడికి వేళాయే

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం



నాడు-నేడు కింద తీర్చిదిద్దిన రామాపురం యూపీ స్కూల్

ఆలూరు రూరల్: వేసవి సెలవులు పూర్తికావడంతో పాఠశాలలు పునః ప్రారంభానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి (గురువారం) నుంచి తరగతులు మొదలు కానున్నాయి. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడమే కాకుండా మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్ రేటు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. ఆలూరు మండలంలో 53 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 9,250 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయానికి పూర్తి స్థాయిలో వసతులు కల్పించారు. ఇందు కోసం విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. బడి ప్రాంగణం, తరగతి గదులను శుభ్రం చేయించారు. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన ఏర్పాట్లు చేశారు. కొత్తగా అడ్మిషన్ పొందే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించారు.

మారిన పాఠశాలల రూపురేఖలు

తుగ్గలి : వేసవి సెలవుల్లో ఆడిపాడిన విద్యార్థులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. 45 రోజుల పాటు మూత పడిన పాఠశాలలు తెరుచుకోనున్నాయి. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం కింద మండలంలో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేని టాయిలెట్లు, తాగునీటి ఇక్కట్లు, ఇరుకు గదుల్లో విద్యార్థులు నేలపైన కూర్చోవడం.. ఇవీ ఒకప్పుడు సర్కారు బడుల దుస్థితి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మారాయి. నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. మండలంలో తొలి విడతలో రూ.4.95కోట్లతో 20 పాఠశాలలు రూపురేఖలు మార్చారు. రెండో విడతలో 38 పాఠశాలల్లో రూ.14.52 కోట్లతో చేపట్టిన పనులు తుది దశకు చేరాయి.

పూర్తిస్థాయిలో అందని పాఠశాలలు..

మండలంలో 10 జెడ్పీ ఉన్నత, 10 ప్రాథమికోన్నత, 44 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 7,174 మంది విద్యనభ్యసించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇంకా మండలానికి పూర్తి స్థాయిలో రాలేదు. మొత్తం 59,092 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 24,138 మాత్రమే వచ్చాయి. విద్యా కానుక కిట్లలో యూనిఫాం మినహా మిగిలిన సామగ్రి చేరింది.



తుంబళబీడు స్కూల్‌లో బెంచీలపై కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)

ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలి

గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఉపాధ్యాయుడు రెగ్యులర్‌గా పాఠశాలకు రావాలి. అలాగే పిల్లలు బడికి వచ్చేలా చూడాలి. అలసత్వం లేకుండా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి. పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు ఇంకా కొన్ని రావాల్సి ఉంది. ప్రతి విద్యార్థికి విద్యా కానుక అందిస్తాం.

– రామవెంకటేశ్వర్లు, ఎంఈవో-2, తుగ్గలి

తుంగభద్ర ప్రాజెక్ట్ డీఏఓగా మాధవరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవరెడ్డి

ఆదోని అర్బన్: తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్ట్ ఆదోని డివిజనల్ అకౌంట్ అధికారిగా సీహెచ్ మాధవరెడ్డిని నియమిస్తూ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మాధవరెడ్డి కోసిగి ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేశారు. ఉన్నతాధికారులు పదోన్నతి కల్పిస్తూ ఆదోని తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్టు డీఏఓగా నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

ఫుట్‌బాల్ కోచ్‌కు ఆర్థిక సాయం

ఎమ్మిగనూరుటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన ఫుట్‌బాల్ కోచ్ మాబుసాబ్‌కు మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మిగనూరు ఫుట్‌బాల్ క్లబ్ (వైఎఫ్‌సీ) సభ్యులు, సీనియర్ క్రీడాకారులు రూ.1.05 లక్షల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. పట్టణంలో ఎంతోమందిని ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన కోచ్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న సభ్యులు ఆర్థిక సహాయం అందించడమే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎఫ్‌సీ సభ్యులు విక్రమ్, పెద్ద ఈరన్న, ప్రసాద్, ముని, శ్రీనివాసరెడ్డి, హనీఫ్, లతీఫ్, తదితరులు ఉన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



కోయిలకొండలో గర్భిణులు, బాలింతలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్‌ఈఓ

కృష్ణగిరి: పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఎంపీహెచ్‌ఈఓ గజేంద్రారెడ్డి సూచించారు. మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో బుధవారం ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, బాలింతలకు టీకాల ప్రాముఖ్యతను వివరించారు. టీకాలు సకాలంలో వేయించకపోతే వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధి నిరోధక టీకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులతోపాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగని వాన..పొంగిపొర్లుతున్న కాలువలు



నిట్రవట్టి గ్రామంలోని వాగులో పొంగి పొర్లుతున్న వర్షపునీరు

హాలహర్వి: మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతకుంట, నిట్రవట్టి, బాపురం, గూళ్యం, మెదేహాల్, సిద్ధాపురం, అమృతాపురం తదితర గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని.. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు, తీగలు నేలవాలితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు కోరారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జడ్జి కుమారి అర్చన

ఆదోని రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదోని ప్రిన్సిపల్ జడ్జి కుమారి అర్చన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా బాగా చదివించాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని వివరించారు. మైనర్ పిల్లలను పనులకు పంపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలకార్మిక చట్టాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. చీటికిమాటికి తల్లిదండ్రులు గొడవలు పడితే ఆ ప్రభావం పిల్లలపై పడుతుందన్నారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శివకుమార్ స్వామి, కళ్యాణ్ రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డీటీఎఫ్ నాయకులకు సన్మానం



డీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: డీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల్లో పదవులు పొందిన స్థానిక నాయకులను బుధవారం ఆ సంఘ కార్యాలయంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కరె కృష్ణ, రాష్ట్ర కార్యదర్శిగా గట్టు తిమ్మప్పతో పాటు జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.వీరన్న, అధ్యక్షులుగా విజీ.వెంకట్రాముడులను విజయవాడలోని ఎన్జీఓ హోమ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు రామన్న, పాటిల్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. డీటీఎఫ్‌లో 25 సంవత్సరాలుగా విశేష సేవలందించిన స్థానికులైన వారికి రాష్ట్ర, జిల్లా పదవులు అలంకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాలు, పుష్పగుచ్ఛాలిచ్చి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు గోట్ల చంద్రశేఖర్, మోహన్, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటేశప్ప, గంగాధర్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జీడీపీ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కర్నూలు సిటీ: గాజులదిన్నె ప్రాజెక్టు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ కోరారు. ఈ మేరకు వారు బుధవారం జల వనరుల శాఖ ముఖ్య ఇంజినీర్ కబీర్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏకైక సాగు నీటి ప్రాజెక్టు(దామోదరం సంజీవయ్య సాగర్)అని, ఆ ప్రాజెక్టు మరమ్మతుల పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. లేకపోతే అధిక వర్షాలు కురిసి వరద నీరు భారీగా చేరితే ప్రాజెక్టు భద్రతకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. జీడీపీ ద్వారా కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, తాగు నీరు అందించాల్సి ఉందన్నారు.

15న డప్పుకళాకారుల సంఘం సమావేశం

కర్నూలు(సెంట్రల్) : ఈనెల 15వతేదీన డప్పుకళాకారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు తెలిపారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు మండల డప్పు కళాకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో డప్పు కళాకారుల పెన్షన్లను పెంచలేదన్నారు. ఈప్రభుత్వంలోనైనా పెన్షన్‌ను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాముడు, ఏసన్న, బిచ్చన్న, మద్దిలేటి, నాగరాజు, శేషన్న, ఆనందం, పాపన్న, రోగెన్న, సంటెన్న, నాగశేషులు, స్వాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజాబాబు అవార్డుకు ఎంపికైన పత్తి ఓబులయ్య

కర్నూలు (సెంట్రల్) : టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రాజాబాబు స్మారక అవార్డుకు ఎంపికైనట్లు ఆ సంస్థ కన్వీనర్ భగీరథ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ నటుడు రాజాబాబు పేరు మీద ప్రతి సంవత్సరం ముగ్గురు సినీ నటులు, ముగ్గురు టీవీ నటులు, ముగ్గురు రంగస్థల నటులకు అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. రంగస్థల నటుల విభాగంలో పత్తి ఓబులయ్య అవార్డుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఫిల్మ్ కల్చరల్ సెంటర్‌లో అవార్డును అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా అఘోర స్వామి ప్రభోత్సవం



మల్లెపల్లిలో అఘోరస్వామి ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామంలో అఘోర స్వామి తిరునాల సందర్భంగా బుధవారం ప్రభోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తిని ప్రభపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

పాఠశాలలకు పుస్తకాల తరలింపు



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఈరన్న

హాలహర్వి: ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు తరలించినట్లు ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులను పరిశీలించారు. వాటిని ఆయా పాఠశాలలకు సరఫరా చేయించారు. ఇప్పటి వరకు 80 శాతం వరకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు వచ్చాయన్నారు. గురువారం పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయని, ఆ రోజున విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల చేతులమీదుగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జింక అప్పగింత



జింకను కాపాడిన యువకులు

పత్తికొండ రూరల్ : పట్టణంలోని చింతకాయల వీధి సమీపంలో ఉన్న పొలాల్లో అభ్యమైన జింకను బుధవారం యువకులు పోలీసులకు అప్పగించారు. పొలాల్లో కుక్కల బారి నుంచి తప్పించుకుని వచ్చిన జింకను కాపాడి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన యువకులను పోలీసులు అభినందించారు.

నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు



ఎల్లార్తి ప్రభుత్వ కన్నడ పాఠశాల

హొళగుంద: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి తెరుచుకోనున్నాయి. మండలంలో 24 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలకు సంబంధించి సుమారు 8,876 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు బ్యాగులు, పుస్తకాలు సిద్ధంగా ఉంచారు.

కరెంటుతో జరభద్రం

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటర్లతో అప్రమత్తత ముఖ్యం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యుత్ అధికారులు

ఆలూరు రూరల్: రుతుపవనాలతో తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు పొలం బాట పట్టారు. ఇప్పటికే పొలాలను దుక్కి,దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తనాలు విత్తినప్పటి నుంచి పంట దిగుబడి వచ్చేంత వరకు వ్యవసాయ పనులపైనే ఎక్కువ దృష్టి సారించనున్నారు. పంటలకు నీరు పెట్టడం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ తీగలు, విద్యుత్ మోటార్ల వద్ద ఎక్కువగా పనిచేస్తుంటారు. కొంత మంది రైతులు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు పాటించకుంటే మృత్యువాత పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్ర,స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా..

స్టార్టర్ డబ్బాలను మోటర్ పక్కనే పొలంలో ఉంచి రైతులు కవర్లు కప్పుతుంటారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అకాశం ఉంటుంది. వాటిలోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు.ఏ తీగ ఏ ఫీజుదో కూడా తెలియకుండా ఉంటుంది. కవర్లు కప్పి ఉంచరాదు. నేరుగా స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫీజు అమర్చుకోవాలి. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి. చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తున్నారు. ఇనుప డబ్బాల్లో స్టార్టరు, ఫీజులు బిగియడంతో ఎలుకలు డబ్బాలో చేరి తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకోగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.



విద్యుత్ తీగలతో ప్రమాదం

గాలివానకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగించుకుని వైర్లను ఇంటికి తీసుకొస్తారు. ఇంట్లో వైర్లు ఉంచినప్పుడు ఎలుకలు కొరికే అవకాశం ఉంది. మరుసటి రోజు మోటర్ వైర్లు తగిలించేటప్పుడు వాటిని సరిగా చూసుకోవాలి. పాత వైర్ల కంటే కొత్త వైర్లు బిగించుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న పొలాల్లో కొంత మంది కర్రల సహాయంతో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి వర్షానికి, గాలికి కింద పడుతుంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లోకి వెళితే కాళ్లకు తగిలి విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులతో మాట్లాడి స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

పొలాల్లో మోటార్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి. వర్షపు నీరు, తేమ తగలని చోట వాటిని అమర్చాలి. ఎర్తింగ్ తప్పని సరిగా ఉండేలా చూసుకోవాలి. విద్యుత్ మోటర్‌లో అంతరాయం ఏర్పడితే ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలి. ఫీజులు పోతే విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో వాటి మరమ్మతులు చేయించుకోవాలి. నాణ్యత, ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ పరికరాలను వినియోగించడం ఉత్తమం.

హొళగుందలో కుండపోత వాన

- జలమయమైన వీధులు
- ఉప్పొంగిన వేదావతి నది

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. హైస్కూల్ గ్రౌండ్, ఎస్‌బీఐ బ్యాంకు, తేరుబజారులో భారీగా వర్షపు నీరు చేరింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండుతున్నాయి. ఎర్రరేగడి నేలలో రైతులు సాగు చేసిన పత్తి మొక్కలు కళకళలాడుతుండగా నల్లరేగడి నేలలో రైతులు విత్తు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇక ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి గ్రామం వద్ద వేదావతి(హగరి) నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో నదీ తీర ప్రాంతాలైన కోగిలతోట, మార్లమడికి, నాగరకణ్వి, హొన్నూరు, ముద్దటమాగి తదితర గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో పంట సాగు, దిగుబడిపై కొండంత ఆశ పెట్టుకున్నారు.



హొళగుందలోని కొర్లెవంకలో పారుతున్న వర్షపు నీరు



మార్లమడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి (హగరి) నది

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు: కొద్ది రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖరయ్య మండల అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. వర్షాలపై ప్రజలు, రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. చెరువులు, వంకలు, వాగుల్లో నీటి పరిస్థితిపై దృష్టి సారించాలన్నారు.